పూర్ణిమ

"నేను ఇండియా వెళదామనుకుంటున్నాను అన్నయ్యా!"

చదువుతున్న పుస్తకం మూసి సూటిగా సహజను చూశాడు మూర్తి.

"ఏం, లాస్‌ఏంజిల్స్ నచ్చలేదా నీకు?" నవ్వుతూ అన్నది మిసెస్ మూర్తి.

"ఛా! ఛా! అదికాదు వదినా! రిసెర్చ్ పేపర్ సబ్మిట్ చేసేలోపల ఒకసారి ఇండియా వెళ్ళాలనిపించింది."

"ఏది... నీ సోషల్ కండిషన్స్, ఉమెన్ - ఆ రిసెర్చ్ కోసరమా? ఇండియాలో నీకు కనబడబోయేది గౌరవం కప్పుకున్న స్లేవరీ, లేకపోతే ఆర్థిక వత్తిడి వల్ల వచ్చిన బానిసత్వం... I don't think you can study real woman there... Any way, నాకు ఆఫీస్ టైం అయింది...బై మూర్తీ...బై సహజా..."

వెళ్ళిపోతున్న ఆమెనే చూస్తున్న మూర్తి చూపులో భావనకు ఉలిక్కిపడింది సహజ... ఏదో వస్తువును చూస్తున్నట్లు చూస్తున్నాడతను.

"అన్నయ్యా!" ఆమె గొంతులో ఏదో హెచ్చరిక.

"ఆఁ!" ఉలిక్కిపడ్డాడు మూర్తి...

"సహజా! నిజంగా నువ్వు నీ రిసెర్చ్‌లో సీరియస్‌గా ఉన్నావా? లేకపోతే పెళ్ళయ్యేదాకా కాలక్షేపం అనుకుంటున్నావా?"

"అదేమిటన్నయ్యా! అసలు... నేను..."

"ఉష్... ఇప్పుడే వస్తాను..."

సంవత్సరం క్రితం స్టూడెంటుగానే అమెరికా వచ్చింది సహజ... వదిన అంటే ముట్టనితనం, అన్నయ్య నిస్సహాయత త్వరలో అర్థమై స్నేహితురాలితో అపార్ట్‌మెంటులో ఉంటోంది సహజ... వదిన చెడ్డది కాదు, ప్రాక్టికల్ మనిషి... అలా అర్థం అవడం వల్ల హాయిగానే ఉన్నది సహజ... కానీ మూర్తన్నయ్య భావుకుడు అనుకునేది... కానీ మరి అమెరికా జీవితం, పెళ్లి, డాలర్ల సంపాదన అతణ్ణి మార్చేశాయేమో అనుకునేది...

ఐదు నిమిషాల తరవాత వచ్చిన అతని చేతులో ఫోటోగ్రాఫ్ - చాలా విలువైన దాన్ని పొదివి పట్టుకున్నట్లు పట్టుకుని వచ్చాడు.

"అరె... ఏమిటిది? రెండు కళ్లు...జస్ట్... రెండు అందమైన కళ్లు... అంతే..."

"చూడు... రిసెర్చ్ చేసేవాళ్లు మామూలువాళ్లు చూడలేని విషయాలు చాలా చూడగలగాలి. మన ఎదురుగా జరుగుతున్న సంఘటనలకు ప్రేరకాలు, మనుష్యుల మామూలు మాటల వెనకాల ధ్వని, నవ్వుల వెనకాల అర్థాలు, చూపుల వెనకాల

భావాలు... ఇవన్నీ... ఇవన్నీ తెలియాలి. ముఖ్యంగా సోషల్ కండిషన్స్ గురించి స్టడీ చేసేవాళ్లు... ఊరికే ఎవరో రాసిపెట్టినవి ఆధారం చేసుకుని డాటా క్రియేట్ చేసి, డాక్టరేట్ కొట్టెయ్యకూడదు..."

సూటిగా చూస్తూ నవ్వుతూనే చెప్తూ ఆమె పక్క సోఫాలో కూర్చున్నాడు మూర్తి.

"అన్నయ్యా!" కోపంగా అన్నది సహజ

"ఒద్దు... అంత రియాక్షన్ ఒద్దులే... చెప్పు... ఆ కళ్లల్లో ఏం కనబడుతున్నాయి నీకు?!" నవ్వాపుకుంటూ అంటున్న మూర్తిలో చిన్నప్పుడు ఉడికించి, ఏడిపించి చాకలెట్ కొనిపెట్టే అన్నయ్య కనబడ్డాడు.

"చెప్తానుండు..." తనూ చిన్నపిల్లలా ముద్దుగా అన్నది సహజ. "అందమైన కళ్లు... ఆ కళ్లలో నవ్వు, ఆనందం, కొంచెం బెరుకు... కనురెప్పల మీద నుంచి జారుతున్న వెలుతురు..."

"గుడ్... ఇంకా..."

"కంటి కింద పుట్టుమచ్చ... ఎవరో చాలా అందమైన మనిషి ఫోటోగ్రాఫ్ అయి ఉండాలి... నుదురు చాలా అందంగా ఉన్నది... ఎవరన్నయ్యా?!"

"అందమంటే... ఒద్దు... మళ్లీ నీకూ నాకూ క్విజ్ ఒద్దు... ఓకే... ఇండియా వెళ్లు... మన ఊరు వెళ్లు... మన కజిన్ రాంబాబు గుర్తున్నాడా నీకు?! వాళ్లింటికి వెళ్లు. అదొక ఉమ్మడి కుటుంబం... అక్కడ పూర్ణిమ ఉంటుంది. ఆవిడను చూడు... నీకు రిసెర్చికు పనికి వచ్చే చాలా విషయాలేమిటో తెలుస్తాయి. అర్థమౌతాయి..."

అలా మాట్లాడుతూ చాలా... చాలా చాలా చెప్పాడు మూర్తి... అతను మనస్సు తెరిచి మాట్లాడడం వల్ల అతని మాటల్లో, చేష్టల్లో ఏదో హాయి... ఇద్దరూ చాలా రుచికరమైన లంచ్ చేసుకుని తింటూ, కబుర్లు చెప్పుకుంటూ... హాయి అంటే ఏమిటో ఇద్దరికీ అర్థమైంది... ఇన్నాళ్లు అన్నయ్యను చూస్తున్నా ఈ కోణం తనకు కనబడలేదేమిటి?! ఆలోచిస్తూనే వింటోంది సహజ.

"వెళ్లేటప్పుడు నేను రాంబాబుకు వీడియో కెమేరా, అందరికీ బహుమతులు ఇస్తాను... ఫారిన్ నుంచి ఖరీదైన బహుమతులు తెచ్చేవాళ్లను తప్పనిసరిగా ఎంటర్‌టైన్ చేసే సంస్కారం అక్కడ చాలా ఉంది. సరేనా?..."

"అన్నయ్యా!"

"ఇంకేం మాట్లాడకు... నీకు ఇప్పటికే చాలా చెప్పాను. ఐనా, ఇంకా నీకు చాలా అడగాలని ఉన్నది... నిజానికి నాకు కూడా చాలా చెప్పాలనే ఉన్నది. కానీ చెప్పడానికి, అడగడానికి మధ్య మాటల్లో ఇమడని అనుభూతి ఒకటుంది... అది నీ అంతట నువ్వే అనుభవించాలని నా ఆశ... సరేనా?..."

బుద్ధిగా, ముద్దుగా తలూపింది సహజ...

❀ ❀ ❀

"రా సహజా! అంతా కులాసాగా ఉన్నారా?" ఆప్యాయంగా అడుగుతున్న పూర్ణిమను పరీక్షగా చూసింది సహజ... కంటి కింద తేనెరంగు పుట్టుమచ్చ... కళ్లల్లోకి సూటిగా చూసింది. ఆప్యాయత చూపించే ఆ కాటుక కళ్లు మరేమన్నా చెపుతున్నాయా అన్నట్లు చూసింది...

అందరికీ అన్ని బహుమతులు ఇచ్చింది... తెచ్చిన చీరల్లో ఎవరికి ఏది నచ్చితే అది అందరూ తీసుకోగా, మిగిలినది పూర్ణిమ తీసుకున్నది.

మూర్తి అన్నయ్య చెప్పింది నిజం... బహుమతులు చాలా చాలా ఆప్యాయతలు తెచ్చిపెడతాయి. అమెరికా అమ్మాయికి బోలెడు మర్యాదలు.

వీటన్నింటిమధ్యా అతి సహజంగా ప్రవర్తిస్తూనే, చాలా అలర్ట్‌గా అందరి గురించీ ఆలోచించే పూర్ణిమ గురించే ఆలోచిస్తోంది సహజ. చాలా మందితో మాట్లాడుతూ, చాలా చాలా విషయాలు సేకరిస్తోంది... తనకు ఇన్నాళ్లు తెలియనివి... అర్థంకానివి...

తన చుట్టూ ప్రపంచాన్ని పులిలా వణికించే రాంబాబును చూస్తే... అతని భార్య... పూర్ణిమ కళ్లల్లో భావన ఏమిటా అని చాలా చాలా వెతికేది సహజ... చాలా తెలుసుకున్నది కూడా...

❀ ❀ ❀

రాంబాబు, మూర్తి, పూర్ణిమ వీళ్లంతా ఒక కాలనీలోనే ఉండేవాళ్లు... పూర్ణిమ సౌందర్యం, ఠీవి, సన్నగా కనుకొలుకల నుంచి మనుష్యుల్ని చూస్తూ... ఆ చూపులతోనే తను వాళ్ల గురించి ఏమనుకుంటుందో చెప్పెయ్యగలగడం... ఆమె ప్రత్యేకత. పన్ను మీద పన్ను ఆమెకు కొత్త అందాన్ని ఇచ్చేది... స్కూలు యూనిఫారం వేసుకున్నా ఆ తరువాత కాలేజీకి వెళుతూ చీర కట్టుకున్నా... ఎలా ఉన్నా తిరిగి చూడాలనిపించే పర్సనాలిటీ ఆమెది... అప్పట్లో దొరికే యాభై ఐదు రూపాయల చీర కూడా గంజి పెట్టి కట్టుకుంటే పట్టుచీరకుండే పరువు తెచ్చేది ఆమె.

అప్పట్లో ఆమె కాలేజీ హీరోయిన్. వాళ్ల నాన్నగారు మంచి పొజిషన్‌లో ఉండేవారు. ఆ అమ్మాయిని ఏ రాజకుమారుడులాంటి వ్యక్తికో ఇచ్చి చేస్తారనుకునే వాళ్లంతా...

రాంబాబు చాలా మంచివాడు – ఎవరూ అతనిలో కాంప్లెక్స్ నిద్ర లేపనంత కాలం... వాళ్ల నాన్న రాంబాబును చదువుకోకపోయినా, బట్టలు మడతపెట్టుకోక పోయినా, ఆయన పెళ్లాం మీద కోపం వచ్చినా, ఆయన ఆఫీసర్స్‌చేత తిట్లుతిన్నా రాంబాబును చావకొట్టేసేవాడు... పదహారేళ్లకు రాంబాబు ఎదురు తిరిగాడు... ఎలా అంటే – పారిపోయి... ఉన్న ఒక్క కొడుకూ పారిపోయి మూడు రోజులకు కనబడితే, ఆ తల్లితండ్రులు పడ్డ నరకయాతన ఆ తరవాత అతనికి ఎమోషనల్ బ్లాక్‌మెయిలే అయిపోయింది. దానితో అతని మాటకు ఎదురు చెప్పేవారు లేకుండా పోయారు. హితం చెప్పేవారు అసలే లేరు.

రాంబాబుకు చాలా సమస్యలు, టెన్షన్స్ ఉండేవి. ముఖ్యంగా ఆడపిల్లల విషయంలో... వాళ్ల వెంటపడేవాడు... వాళ్లు మాట్లాడితే., "అడ్డమైన నీతీ జాతీలేని రకాలు... ఛీ" అనుకునేవాడు. వాళ్లు మాట్లాడకపోతే... "ఏం చూసుకుని ఈ టెక్కు..." అని తిట్టుకునేవారు... ప్రతి కాంప్లెక్సు మనిషికి ఉన్నట్లే అతనికి నోటి దురుసు, అసభ్య పదజాలం, ప్రథమ కోపం చాలా ఉండేవి.

ఆడవాళ్లంటే వాళ్ల అమ్మలా, పిన్నుల్లాగా జుట్టు చెరిగిపోయి, జిడ్డోడి పోతూ, నలిగిపోయిన ఖరీదైన జరీ చీరలు కట్టుకుని, హాల్లో కూర్చుని పిండి వంటలు చేసుకుంటూనో, తింటూనో, బంగారు గాజులు సర్దుకుంటూ పనివాళ్ల మీద, పక్కవాళ్ల మీదా, అక్కడ లేనివారి మీదో చాడీలు చెప్పుకుంటూ ఉండడమే చూశాడతను...

కూరలో ఉప్పు తక్కువవడం దగ్గర నుంచి, 'మా అక్కను అంటావా?' అనే విషయం వరకు మొగవాళ్ల చేతిలో ఆ వంశంలో ఆడవాళ్లు దెబ్బలు తింటూనే ఉండేవారు... మర్నాడే మళ్లీ "మా ఆయన తెచ్చారు..." అని ప్రదర్శించగలరు. మరొక రెండు నెలల్లో "నెల తప్పింది" అని ముచ్చటపడుతూ చెప్పుకోనూ గలరు. ఇది అవస్థ, ఇందులో న్యూనత ఉన్నదని వాళ్లేనాడూ అనుకోలేదు... వాళ్లకే తెలియనప్పుడు ఆ ఇంట్లో పెరిగిన మొగపిల్లవాడికి, ఆడదీ, ఆమెకు ఆత్మాభిమానం వగైరా ఉంటాయన్నదీ తెలిసే అవకాశం అసలు లేదు.

అలా పెరుగుతున్న రాంబాబుకు పెత్తండ్రి కొడుకు మూర్తి అంటే చాలా ఇష్టం, హీరో వర్షిప్ ఉండేది...

మూర్తికి పూర్ణిమ అంటే పిచ్చి ఆరాధన.

"ఒరేయ్ రాంబాబూ! ఆ అమ్మాయి... అంత దేవతేమిటిరా అసలు?! అంత సున్నితత్వం... ఆ మనిషి... వీళ్లంతా ఆమె దగ్గర స్త్రీత్వం నేర్చుకోవాలి... ఏ భంగిమలోనైనా అంత అందంగా ఎలా ఉండగలదు అసలు?!..." ఇలా మాట్లాడేవాడు మూర్తి.

దీనివల్ల ఒక మేలు జరిగింది. రాంబాబుకు స్త్రీలపట్ల ఉన్న దృక్పథంలో కొంత మార్పు వచ్చింది... ఆడవాళ్లలో రకరకాల ఆడవాళ్లు ఉంటారని మాత్రం అర్థమైంది. అసలు, ఆడవాళ్లను, చీపురుకట్ట, వడ్లగంప, లావాటి పరుపు, లాంతరు, రోలు, బావిలో చేద... ఇలా ఉపయోగించే వస్తువుగా మాత్రమే కాకుండా మరొకరకంగా చూడవచ్చని అర్థమైంది...

"ఒరేయ్ రాంబాబూ! ఏదైనా నాకేం లాభం అని ఆలోచించకుండా చూడడం నేర్చుకో... పొద్దున్నే వచ్చే సూర్యోదయం ఎంత గొప్పగా ఉంటుంది? ఆఁ! రోజూ వచ్చేదేగా... అనెయ్యకు... సాయంత్రానికి వాడిపోయే ఆ జూకామందారం నీరెండలో ఎలా ఉన్నదో చూడు... ఎన్ని హొయలు, ఎంత అందం?!" ఇలా మాట్లాడేవాడు మూర్తి... ఎందుకో అతను మాట్లాడే ప్రతి మాటా పూర్ణిమ గురించే అన్నట్లు వినబడేది రాంబాబుకు...

ఈ మాటల వల్ల రాంబాబు ఎంత ప్రభావితుడయ్యాడో చెప్పలేం... కానీ, ఒకరోజు గుళ్లో ఏవో పూజలూ అవీ జరుగుతూంటే బోలెడు మంది ఆడవాళ్లు పోలోమని బైటకు వస్తున్నారు. వాళ్ల మధ్య సున్నితంగా అడుగులు వేసుకుంటూ, బైటకు వస్తోంది పూర్ణిమ. రాయంచకు చీర కట్టినట్లు, అమ్మవారు అర్జంటుగా కాలేజీ స్టూడెంటులా అలంకరించుకున్నట్లు... ఒక్కసారి ఆమె చుట్టూ ఉండేవాళ్లను చూశాడు. మొరటు మోచేతులు, మూతులు గట్టిగా కొంగుతో తుడుచుకుంటూ, కళ్లనిండా అసూయలు, అహంకారాలు, ఎదటివాళ్ల ప్రశంసల కోసరం నగల సవరింపులు... వాళ్ల మధ్య అతి నిర్మలమైన చూపులతో పూర్ణిమ!

'ఈ పిల్ల పారిజాతం పూదండలా ఉంటే... వీళ్లంతా గవిడి గేదెలను నిలబెట్టి పట్టుచీరలు కట్టినట్టు...' అనుకున్నాడు... అతని సంస్కారం అలాగే ఆలోచించగలదు మరి.

ఈ మొత్తం గందరగోళంలో పూర్ణిమ గొప్ప అందని జాబిల్లిలా, చాలా వాంఛించదగ్గ స్త్రీమూర్తిలా తయారైంది. ఆమెను మూర్తి పెళ్లి చేసుకుంటాడు అనుకున్నాడు కూడా.

కానీ, మూర్తికి ఫారిన్ ఛాన్స్ వచ్చి వెళ్లిపోయాడు. అక్కడ సెటిల్ అయిన తరవాత, కుటుంబం అప్పులు తీరిన తరవాత పూర్ణిమను చేసుకోవాలన్నట్లు చెప్పాడు...

జీవితంలో ముఖ్యమైన విషయాలు ముందు వెనక అవడంవల్ల జరిగే పరిణామాలు విపరీతంగా ఉంటాయని మూర్తికి తెలియదు అప్పుడు.

ఆ పరిణామక్రమంలో పూర్ణిమ జీవితంలో పెద్ద పెద్ద ట్రాజడీలు చాలా జరిగాయి. మూర్తి వెళ్లిపోవడం అనేది ట్రాజడీ అని అప్పట్లో ఆమెకు తెలియదు... కానీ తండ్రి హార్ట్ ఎటాక్‌తో పోవడం, కూతురుపట్ల ముద్దుతప్ప, రక్షణ తెలియని తండ్రి అతి తక్కువ ఆస్తి మిగిల్చిపోవడం, వీటితోపాటు మరొక అత్యంత ఘోరమైన విషయం... మేనత్త ఎవరితోనో లేచిపోవడం... "నాతో కాపరం చెయ్యడానికి కట్నం అడిగేవాడిని ఏం పేరు పెట్టి పిలవాలి?" అని ప్రశ్నించి తన ఇష్టమైన వ్యక్తితో వెళ్లిపోయిన ఆ అమ్మాయి తన వ్యక్తిత్వం నిలబెట్టుకున్నాననుకున్నది. కాని, దాని పరిణామాలు ఆలోచించలేదు. పూర్ణిమ మేనమామ చాలుగాయి వంశం అని తిట్టి బాధ్యతలు తప్పించుకున్నాడు. మేనత్తకు తప్పిపోయిన పెళ్లివారు ఏమీ చెయ్యలేక, పూర్ణిమ గురించి, ఆమె తల్లి గురించి దుష్ప్రచారం చేసి కచ్చ తీర్చుకున్నారు.

తండ్రి ఉన్నంతకాలం మహారాణిలా కనబడ్డ తల్లిలో ఎంత బేలతనం ఉన్నదో, ఎంత అమాయకత్వమున్నదో అర్థమైంది పూర్ణిమకు. పెళ్లైన పాతికేళ్లలో ఆమె నేర్చుకున్నది ఏమీలేదు, భర్త చెంతన బ్రతకడంతప్ప. అండలేని సాంఘిక పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో తల్లికి, కూతురికీ–ఇద్దరికీ తెలియదు.

అలాంటి పరిస్థితుల్లో...

"పిల్ల మనకు తెలిసినదేగా... బాగానే ఉంటుంది. ఎవరో వేలు విడిచిన పెదనాన్న సాంప్రదాయం కావాలని తిరుగుతున్నాడు. అయినా మనకు తూగే సంబంధం కాదేమోనని బావగారు అంటున్నారు..."

భోజనాలు చేస్తూ హాల్లో పిన్నులు, తల్లి పెదనాన్న మాట్లాడుకోవడం విని, ఎవరి గురించో తెలుసుకున్న రాంబాబుకు కళ్లు తిరిగాయి.

పూర్ణిమ... తనకు సంబంధంగా వచ్చింది...

అంతే... ఆ రాత్రి నిద్ర పోలేదతను... ఏదైనా టెన్షన్ వస్తే కర్చీఫ్ తినేసినంత పని చేస్తాడతను... ఆ రోజు రాత్రి మూడు కర్చీఫులు ముక్కలైపోయాయి.

మర్నాడు, 'ఆ సంబంధమే చేసుకుంటాను' – అని డిక్లేర్ చేసి, ఎవరూ ఏమీ అనకపోయినా, "ఆ కుటుంబాన్ని ఏమన్నా అంటే వాయించేస్తాను..." అని వార్నింగులు ఇచ్చి, నానా గందరగోళం చేసి, "వీడి నోరుబడ –" అని వాళ్ల సంస్కారం ప్రకారం ఇంట్లో ఆడవాళ్లు మెటికలు విరిచే స్థితి తెచ్చుకున్నాడు.

"వాళ్లనేం కట్నకానుకలు అడక్కండి!" మరొక ప్రకటన చేశాడు.

'నేను నిన్ను చేసుకోడం నీ అదృష్టం చూశావా?' అన్నట్లు చూసే అతణ్ణి లాంఛనపు తాంబూలాల ఫంక్షన్‌లో ఒక్కసారి చూసి తలదించుకున్నది పూర్ణిమ.

మూణ్ణిద్దర్లలోనే తను ఆ ఇంట్లో ఎంత ముఖ్యమైన వ్యక్తో, తన మాటకు ఎంత విలువ ఉన్నదో చెప్పేస్తూ ఇల్లంతా చెడ తిరిగేసి, కుక్కను అనవసరంగా బెల్టుపెట్టి కొట్టి, అందరి మీదా అరిచి, స్నేహితులకు తనకు అంత అందమైన భార్య దొరికినందుకు రాత్రి ఒంటిగంట దాకా డ్రింక్‌పార్టీ ఇచ్చి, గదిలో అడుగుపెట్టి, స్నానం చెయ్యకుండా, కాళ్లు కడుక్కోకుండా ఓరగా ఆమె వంక చూస్తూ 'నాకు నిద్ర వస్తోంది' అని మంచంమీదపడ్డ ఆ మనిషిని మరొకసారి నిశ్శబ్దంగా చూసింది పూర్ణిమ. ఆ రాత్రి అతని బలవంతానికి, అతని ఎమోషన్స్‌కు బలైపోతూ "నిన్ను సుఖపెడతాను. నా మాట విని బుద్ధిగా ఉండు, నాకు ఎదురు చెప్పకు" అని పలవరిస్తున్న భర్తను చూడలేక కళ్లు మూసుకున్నది పూర్ణిమ.

కానీ... ఆమె అంతర్‌చక్షువులు తెరుచుకోవడం ప్రారంభించాయి. కాపరానికి వచ్చిన వారంరోజుల్లోనే పూర్ణిమ ఎంత విడిమనిషో అర్థమైంది అందరికీ... వేరు సెనక్కాయల పాతర మీద రోజాపువ్వులా ఉన్నది.

సంస్కారంలేని ఆడవాళ్లు ఏదైనా సహిస్తారు కానీ, మరొక ఆడదాన్లో ప్రత్యేకతను అసలు సహించలేరు... అది ఆ ఇంట్లో ఏ మొగవాడన్నా గుర్తించాడా – ఇంక ఆ ఆడదాని జీవితం నరకమే.

అంత కచ్చతో వాళ్లు కలిగించేది ఆత్మన్యూనత... ఆ అస్త్రాన్నే పూర్ణిమ మీద ఉపయోగించారు.

మూర్ఖులైన ఆడవాళ్లకుండే ముఖ్యాస్త్రాలు దొంగతనం అంటకట్టడం, క్యారెక్టర్ అసాసినేషన్...

"మా అల్లుడికి అలా పమిట జారిపోతూ పులుసు వడ్డించాలా?" హుంకరించింది చిన్నత్తగారు.

"నా గదిలో కొబ్బరి నూనె సీసా తియ్యడమెందుకు? దొంగ బుద్ధులు, లేకి లక్షణాలు" అన్నది ఆడపడుచు.

అవాక్కై నిలబడిపోయింది పూర్ణిమ. అన్నవాళ్లను ఆశ్చర్యంగా చూసింది... చదువుకు సంస్కారానికి సంబంధం లేదు. ఆ అన్న అత్తగారు ఆ కాలం బి.ఏ. ఆడపడుచు పి. హెచ్ డి. చేస్తోంది.

"అసహ్యంగా మాట్లాడకండి..." అని మాత్రం అనగలిగింది పూర్ణిమ... ఏడుస్తూ పారిపోయింది గదిలోకి.

ఆ సాయంత్రం హాల్లో పంచాయితీ పెట్టాడు రాంబాబు. "ఏమిటి మా అమ్మను, చెల్లెల్ని అన్నావుట? నిజమేనా?" నిలదీస్తున్న అతణ్ణి మళ్లీ కళ్లెత్తి ఒక్కసారి చూసింది పూర్ణిమ... ఆ చూపులు... ఒకసారి అతనికి అర్థమయినట్టైంది... అతనికి తెలియకుండానే అతనిలో దాగిన ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్... ఏదో అలజడి, ఎక్కడో కుంగిపోతున్నట్లు... అంతే... ఈడ్చి కొట్టాడు పూర్ణిమను అతను.

"ఒళ్లు దగ్గర పెట్టుకుని బ్రతుకు, జాగ్రత్త!..." అన్నాడు. గుమ్మానికి ఆనుకున్న పూర్ణిమ అలాగే కుప్పకూలిపోయింది.

ఆ తరవాత... రాంబాబు బంగారు, హాస్పిటల్, మందులు, బత్తాయి రసాలు, నిద్రపోకుండా జాగరణలు...

"నువ్వంటే నాకు ప్రాణం... నిన్నెవరన్నా అంటే సహించను... అలా అనిపించుకోకుండా ఉండాలి నువ్వు..." బుజ్జగిస్తూ, తన మీదకు వంగి చెప్తున్న భర్తను కళ్లెత్తి చూడకుండా ఆ చూపులు దాచేసుకున్నది పూర్ణిమ.

ఆ తరవాత పురుడు... ఆమె తల్లికి జరగవలసిన అన్ని అమర్యాదలు, హోదాలపరంగా, అలవాట్లపరంగా, మాటలపరంగా... జరిగాయి. పుట్టింటిని అవమానించడం వీళ్ల మరొక అస్త్రం అని అర్థమైంది పూర్ణిమకు.

"అమ్మా! నువ్వు వెళ్లిపో... నిన్నంటుంటే భరించలేను..." అని పూర్ణిమ ఏడ్చేదాకా తెచ్చారు వ్యవహారం.

"బాలింతను ఎలా ఒదిలిపెట్టనే...?" ఏడ్చింది తల్లి.

"ఫరవాలేదు... నువ్వు లేకపోతే, బాధ్యతలేని పుట్టింటివాళ్లు అని తిట్టుకుంటూ మా ఆయన మంచి సంపాదించడానికి అన్ని ఉపచారాలు చేస్తారు. నువ్వు వెళ్లి హాయిగా ఉండు..." అని బలవంతంగా పంపించేసింది తల్లిని పూర్ణిమ.

"మీ అమ్మకు ఏం చూసుకుని ఆ పొగరు అంటోంది మా అమ్మ... ఏమన్నదేమిటి ఆవిడ?" అడుగుతున్న భర్తను చూడకుండా మరొక్కసారి చూపులు దాచేసుకుంది పూర్ణిమ.

తమను కాదని వెళ్లిపోయిన ఆడపడుచు సుఖంగా ఉన్నదా? తమందరి మాట కాదనక తలవంచుకుని తాళి కట్టించుకున్న కూతురు సుఖంగా ఉన్నదా? అన్న

ప్రశ్నకు జవాబు తెలిసి భయపడింది తల్లి. ఒంటరితనం, దిగులు, ఉన్న ఒక్క కూతురు దూరమైపోవడం - మంచం పట్టింది తల్లి... తీసుకువెళ్లి చూపించి తీసుకువచ్చేవాడు పూర్ణిమను రాంబాబు; రాత్రి తల్లితో ఆమె ఉండకూడదు.

"మా అమ్మ వద్దన్నది... మా అక్కయ్య ఏమన్నా అంటుంది..." ఈ మాటల వెనకాల అతని ఇన్‌సెక్యూరిటీ పూర్ణిమకు అర్థమయింది.

తల్లి పోయింది.

"మీ అమ్మ ఛస్తే. మన ఇంట్లో ఎందుకు పండగ మానుకోవాలి... అది మన ఆచారం కాదు అంటోంది మా అమ్మ..." అని తల్లి చచ్చిపోయిన నెలరోజుల లోపల ఖరీదైన పట్టుచీర కట్టించాడు భర్త.

చాలా చాలా అర్థమైపోతున్నాయి పూర్ణిమకు.

అతనిచ్చే ఏ బహుమతీ అతనివ్వాలనుకున్నదే కానీ, ఆమెకు కావల్సినది కాదు.

తనకు ఇష్టమైన లేత ఆకుపచ్చ, లేత గులాబీ రంగులు చూసి, "ఎలా తెలా పోతూ ఏమిటా రంగులు?" అని పెద్దత్తగారు వంకర నవ్వు నవ్వినప్పుడు తలెత్తి నిశ్శబ్దంగా చూసింది పూర్ణిమ... అవే చూపులు... మరెప్పుడూ తనకు ఇది ఇష్టం అని చెప్పలేదు. ఆమె మొరమరాలు అడిగితే అతను వేరుశనగలు తెస్తాడు... "నీ ఇష్టమేమీ లేదు... నా ఇష్టమే అంతా..." అన్ని విషయాలు చెప్పే చాలా నగలు, చీరలు, ఆస్తులు ఆమె పేరన ఉన్నాయి. ఆమెకు కానివి, హక్కులేనివి, అలంకారమైనవి.

రెండవ పిల్లాడు పుట్టినప్పుడు మొగపిల్లల్నే కన్నందుకు అందరూ అభినందించారు రాంబాబును.

అప్పుడే వచ్చాడు స్టేట్స్‌నించి మూర్తి.

ఏదో తెలియని హాయి వాతావరణంలో గుర్తించి కళ్లు తెరిచి చూసింది పచ్చిబాలింత పూర్ణిమ.

చేతుల్లో రోజా పువ్వులతో వళ్లంతా కళ్లుగా చూస్తున్నాడు మూర్తి... ఆశ్చర్యంగా, ఆనందంగా, హాయిగా... కళ్లెత్తి చూసింది పూర్ణిమ. చటుక్కున ఫోటో తీశాడు మూర్తి.

గభాలున ఒంటినిండా దుప్పటి లాక్కున్నది... ఎవరన్నా చూస్తారేమోనన్న భయం. మరొక ఫోటో తీశాడు - పాపతో కలిపి.

"ఒద్దు... తప్పు..." అన్నది తలవంచుకుని.

"ఏది? ఏమిటి తప్పట?" సుస్మితంగా అడిగాడు.

మరొకసారి తలెత్తి చూసింది... గుండెల్లోని అనుభూతి కళ్లల్లోకి నీడలా... కన్నీరుగా...

చటుక్కున కెమేరా క్లిక్‌మనిపించాడతను.

ఆమె కళ్ళల్లో మళ్ళీ భయం నీడలు.

"పూర్ణిమా!... భయపడకు... ఎక్కడో ఏదో తప్పు జరిగిపోయింది. నేనేం చెప్పలేను. మనిషి జీవితంలో తెలుసుకోవలసింది ప్రియారిటీ అని ఆలస్యంగా అర్థం చేసుకున్నాను... ప్చ్... టూ లేట్... ఇదిగో నా అడ్రస్... అలా చూడకు... నాకు ఉత్తరాలు రాయద్దు. రాయవని తెలుసు... కానీ... ఏ బాధ అయినా అర్థం చేసుకునే స్నేహితుడున్నాడనుకుంటే హాయి... కాగితం మీద రాసేసి, నాకు పోస్ట్ చేశాననుకుని చింపెయ్యి... నిజంగా పోస్ట్ చేద్దామనుకున్నప్పుడు ఇందులో అడ్రస్... వస్తాను..." కార్డ్ ఆమె చేతిలో పెట్టి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడతను.

వరండాలో రాంబాబు గొంతు... భయపడిపోయింది పూర్ణిమ. మూర్తి వచ్చాడని తెలుస్తే... కార్డు దాచేసుకున్నది... రోజాపువ్వులు దిండుకింద పెట్టేసింది.

"ఏరా, ఎలా వున్నావు?" మూర్తి గొంతు.

"బాగున్నాను... నాకు రెండవ కొడుకు." వచ్చి చూడమనలేదు రాంబాబు.

"గుడ్... కంగ్రాట్స్... నాకిప్పుడు టైంలేదు చూడాలంటే, వస్తాను..." వెళ్ళిపోయాడు మూర్తి.

రాంబాబు వచ్చేటప్పటికి నిద్రపోయినట్టు నటించింది పూర్ణిమ. అది తప్పో రైటో ఆమెకే తెలియదు. ఆ పెద్ద పెద్ద బీరువాలున్న గ్రనైట్ ఫ్లోర్ ఉన్న బంగళాలో ఏవీ తనవి కావనిపించేవి. ఒక్క చీరల అడుగున దాచిన ఆ కార్డ్. వాడిన రోజాపువ్వులు, అమ్మ చచ్చిపోతూ ఇచ్చిన గాజుల జత తప్ప.

ఆ తరవాత పూర్ణిమ జీవితాన్ని తట్టుకోవడం నేర్చుకున్నది. మూర్తి చెప్పిన ట్రిక్ బాగా పని చేసింది. కాగితం మీద అన్ని బాధలు, తిట్లు, కోపాలు రాసేసుకుని చింపెయ్యడమో, కాల్చేయ్యడమో చేసేది. ఈ కథార్సిస్ వల్ల ఆమె మానసిక బలం ఎక్కువైంది.

ఆ సంవత్సరం న్యూ ఇయర్ కార్డ్ మిసెస్ అండ్ మిస్టర్ రాంబాబుకు మిసెస్ అండ్ మిస్టర్ మూర్తి దగ్గరనుంచి వచ్చింది. ఆ కార్డు అలా చూస్తూ ఉండిపోయింది పూర్ణిమ. ఆ అమ్మాయి ఎలా ఉంటుందా? అని వూహించుకున్నది...

మూర్తికి పెళ్ళైంది అని తెలిసి విపరీతంగా సంతోషించాడు రాంబాబు... అతనిలో అంతర్గత భయాలు చూసి నవ్వుకున్నది పూర్ణిమ.

"ఈ కార్డు మీద ఏదో రాసుంది, చదివావా?" అంటూ ఇచ్చి వెళ్ళిపోయాడు రాంబాబు.

``We visit others as a matter of social obligation... How long has it been since we have visited with ourselves?"

అన్న కొటేషన్ ఉన్నది... అంతే... పూర్ణిమలో చిన్న చిన్నగా చైతన్యం ప్రారంభమైంది. తనను తాను పరీక్షించుకోవడం ప్రారంభించింది.

తనతో తాను బ్రతకడం తనకు ఎంత భయమా? అని ఆశ్చర్యపోయింది.

ఎదటివాళ్లుకాదు తన సమస్యలకు కారణం. ఆ సమస్యలను తనలో ఏదో అధైర్యం ఆహ్వానించి బాధపెడుతోంది. ఎవర్నీ పెద్దవాళ్లను చేస్తేకానీ తృప్తిపడని ఏదోకరుడుకట్టిన తెలియని కర్కశత్వం తనలో ఉన్నది... ఇది మార్చుకోవాలి. ఎదటి వాళ్లలో చాపల్యం, కుసంస్కారం, అజ్ఞానం తనకు ఏదో ఆనందాన్నిస్తోంది. ఇదొక రకమైన రోగగ్రస్త మనస్తత్వం. తనలో లోపాలు ముందు తగ్గించుకోవాలి... తన ప్రవర్తన ఎదటివాళ్లలో ప్రేమనో, అభిమానాన్నో నిద్రలేపకుండా కచ్చను, అసూయను నిద్ర లేపి పలకరించేట్లు తనూ ప్రవర్తిస్తోంది. తెలిసినట్లున్న తనకు, తెలియని వాళ్లకు ఏమిటి తేడా?! ఉలిక్కిపడింది... తనలో లోపాలు గ్రహించుకుని తనను తాను గౌరవించుకోనిది బ్రతకలేనని గ్రహించుకున్నది. అది అహంకాదు... అంతర్మథన.

ఇప్పుడు ఆమెను కష్టాలు, అమర్యాదలు, సూటీపోటీ మాటలు బాధ పెట్టడంలేదు. దైన్యంపోయి, తన చుట్టూ మనుష్యుల మీద జాలి పెరిగింది.

రెండేళ్ల తరవాత భార్యతో ఇండియాకు వచ్చిన మూర్తికి పూర్ణిమతో మాట్లాడే అవకాశం రాకపోయినా, ఆమెలో మార్పు స్పష్టంగా అర్థమైంది. కానీ మూర్తి భార్య మాత్రం–

"ఆ మనిషేమిటి అలా గాడిద చాకిరీ చేస్తూ... ఎమోషనల్ స్లేవరీ... ఛీ! నేనైతే ఎప్పుడో డైవర్స్ ఇచ్చేదాన్ని..." అనేసింది పూర్ణిమను చూసి... జవాబు చెప్పలేదు మూర్తి... చెప్పలేదు కూడా.

❀ ❀ ❀

ఆ ఇంట్లో ఉన్న రెండు వారాల్లోనే ఇంచుమించుగా ఈ కథంతా తెలుసుకున్నది సహజ... కొంచెం ఊహించుకున్నది. ఎప్పుడూ బిజీగా, క్షణం తీరిక లేకుండా అందరికీ అన్నీ అమర్చిపెట్టే పూర్ణిమ సాన్నిధ్యంలో ఏదో హాయి...

ఇంతకీ పూర్ణిమ హాయిగా ఉన్నదా? అని, అదే ప్రశ్న అడిగింది సహజ.

నవ్వింది పూర్ణిమ వెన్నెలలా.

"నేను హాయిగా ఉండటానికి మరొకరిమీదో, పరిస్థితులమీదో ఆధారపడే స్థితిలోలేను సహజా!... నాకు హాయిగా ఉండటం తెలుసు..." బట్టలు ఆరేస్తూ అన్నది పూర్ణిమ.

"ఎవరివి వదినా, ఇంత చిన్నపిల్లల బట్టలు?"

"మా పిన్నత్తగారి రెండో కోడలు పిల్లలవి... వాళ్లాయన పేకాటలో ఆస్తులు పోగొట్టాడు... అతణ్ణేమీ ఎవరూ అనరు... మొగవాడు కాబట్టి... కానీ ఆ పిల్ల దురదృష్టమని ఆ పిల్లను శిక్షిస్తున్నారు... సంపాదనలేని భర్త ఉంటే, ఆపైన పిల్లలుంటే ఇంక ఈ కుటుంబ వ్యవస్థలో ఆ ఆడదానికి నరకమే... మిగతా ఆడవాళ్లు ఆమెకు విధించే శిక్షలు... ఘోరం... ఆ పిల్లకు జ్వరం... పనిమనిషి వాళ్ల కుటుంబం బట్టలు ఉతకదు... అందుకని నేను ఉతికి ఆరేస్తున్నాను. రేపు పిల్లలు స్కూలుకు వెళ్లాలి కదా!"

"పనిమనిషి ఎందుకు ఉతకదు?"

"అది అంతే... వాళ్లాయన సంపాదించలేడు కాబట్టి ఆ పిల్లకు కనీస సుఖాలు ఉంచరు. ఆత్మన్యూనత కలిగిస్తారు... ఇక్కడ ఆడవాళ్లు అప్పడాలు, వడియాలు తినకూడదు... అవి మొగవాళ్లకు మాత్రమే పరిమితి అనే కుటుంబాలున్నాయి..."

"అదేమిటి? ఇది అడివా? వీళ్లు మనుష్యులు కారా? నాన్సెన్స్..."

"తిట్టకు సహజా! అర్థం చేసుకో... ఈ వ్యవస్థ రక్షించబడాలంటే మారవలసింది ఆడవాళ్లు... పెళ్లికి పిల్లలు పుట్టడం సెక్యూరిటీ అనుకుంటున్నారు కానీ ఆ పిల్లలను ఎలా పెంచగలం అని ఆలోచించడం లేదు... ఒక్క బిడ్డ స్కూలిడ్ పూర్తిచెయ్యడానికి లక్ష రూపాయలు అయ్యేకాలం ఇది. ఏ సెక్యూరిటీతో బ్రతుకుతారు? బైటకు వెళ్లలేరు... వీళ్లు సంపాయించలేరు... కుటుంబపరువు అంటారు..."

"మరి దీనికి పరిష్కారం?"

"కుటుంబ వ్యవస్థ రక్షణ కల్పించడం నేర్చుకోవాలి. లేకపోతే కూలిపోతుంది. ఫామిలీ ట్రస్టులు ఉండాలి... బాధ్యతలులేని కుటుంబ గౌరవాలు లాభంలేదని ఆడవాళ్లకు అర్థమవగానే ఈ వ్యవస్థను కూల్చేస్తారు... ఈ అజ్ఞానం, అర్థంలేని అహంకారంవల్ల లాభంలేదు..."

"నువ్వేం చెయ్యగలవు వదినా?... ఇలా బట్టలు ఆరేసి పెట్టగలవు... చిన్న చిన్న సహాయాలు చెయ్యగలవు... అంతేగా?..." సూటిగా చూస్తూ అడిగింది సహజ.

నిట్టూర్చింది పూర్ణిమ...

"నేను కొంచెం మాత్రమే చెయ్యగలనేమో!... ఆ అమ్మాయికి అండగా ఉండగలను కానీ రాంబాబుగారు చాలా చెయ్యగలరు... ఆయనచేత చేయిస్తున్నాను. ఆ పిల్లలకు చదువు, ఆమెకు ఇన్సూరెన్స్ చేయింటారు.. ఏదైనా చెయ్యాలిగా..."

"హుం! మరి మిగతావాళ్లకు బాధ్యత లేదా? మరి ఈ ఒలకబోసే ప్రేమానురాగాలు, ఇదంతా పై డ్రామాలేనా?"

"హుం!" విరక్తిగా నవ్వింది పూర్ణిమ...

"మా మామగారు చచ్చిపోయినప్పుడు ఆస్తుల పంపకాలప్పుడు కాట్లకుక్కలు కొట్టుకున్నట్లు కొట్టుకున్నారు వీళ్లంతా... డబ్బు పునాదిగా ఉండే బంధుత్వాలు బాంధవ్యాలుగా మారవు సహజా!... వీళ్లకు మేథోపరంగా గౌరవాలు, మనిషిని మనిషిగా గుర్తించుకోవడం రానప్పుడు ఈ పరిస్థితులింతే..."

ఆమె వంకే చూస్తోంది సహజ... ఆ కళ్లు... ఆలోచనలతో చాలా షార్ప్‌గా, వెలుతురుతో... కరుణతో... జాలితో...

ఈవిడ ఈ కుటుంబంలో ప్రతి ఒక్కరి గురించీ ఆలోచిస్తుంది. అవసరాలు తీరుస్తుంది... కానీ... వీళ్లందరికీ ఈవిడ 'బాబుగాడి భార్య' అంతే... వినయంగా, అమాయకంగా కనిపించే ఈ యువతి తమ అందరి యోగక్షేమాలు ఆలోచిస్తోందని ఎప్పటికీ వాళ్లకు అర్థంకాదేమో...

* * *

ఆ రోజు దేవాలయంలో ఏదో అభిషేకాలు... అందరు చుట్టాలు అక్కడికి చేరారు... అక్కడ భగవంతుడి గురించి తప్ప అందరి గురించీ గందరగోళంగా మాట్లాడేస్తున్నారందరూ. పూజారి దారిన పూజారి నమకం చమకం యాంత్రికంగా చెపుతున్నాడు...

"అబ్బబ్బ... ఇక్కడ ఊపిరి ఆడడంలేదు వదినా!... దా బైటకు వెళదాం..." అన్నది సహజ.

గుడి ప్రాంగణంలో నాగలింగం పూల చెట్లకింద కూర్చున్నారు ఇద్దరూ...

బస్తాడు కొబ్బరికాయలు పట్టించుకుని రావడానికి వెళ్లిన రాంబాబుకు గుడికి రాగానే తమ జనంలో భార్య కనిపించలేదు. అడిగాడు అందర్నీ... ఒక అరగంట రభస తరవాత–

పూర్ణిమ భుజం మీద ఒక చెయ్యి బలంగా పడింది...

కొంచెం దూరంలో పొగడపూవులు ఏరుకుంటున్న సహజ రాంబాబు మాటలు విని అవాక్కైపోయింది.

"అందుకే... అందుకే... మా అమ్మ అంటుంది – నీకు స్వతంత్రం ఇస్తే నువ్వు మీ అత్తలా లేచిపోతావని..."

తలెత్తి చూసింది పూర్ణిమ... మౌనంగా అతనితో కలిసి వెళ్లిపోయింది. ఆశ్చర్యంగా అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్లింది సహజ. ఆ తరవాత అతడు ఒక వికృత నృత్యం చేశాడు ఇంట్లో.

"ఇంత పిచ్చి వెధవేమిటి వీడు? చెప్పకుండా ఎందుకు వెళ్లావ్? అని ఒక వందసార్లు అని ఉంటాడు..." అన్నది ఇంక ఉండబట్టలేక పెద్దత్తగారు.

ఏమీ జరగనట్లు కాసేపటికి వెళ్లి... "రండి... అన్నం పెడతాను..." అని బతిమాలి, తప్పంతా తనదే అయినట్లు సారీ చెప్పి భోజనం పెడుతున్న పూర్ణిమను చూసి ఒళ్లు మండిపోయింది సహజకు.

"సహజా! నా మీద కోపంగా ఉన్నదా?" సాయంత్రం నవ్వుతూ వచ్చి అడిగింది పూర్ణిమ...

"ఎలా నవ్వగలవు వదినా?... ఇన్నాళ్లు నీ ప్రవర్తన చూసి కూడా అంత అమర్యాదకరంగా ఆ మనిషి ఎలా మాట్లాడగలడు వదినా?..." కోపంగా, రోషంగా అన్నది సహజ... ఈ కొద్దిరోజుల్లో పూర్ణిమ మీద ఏదో ప్రేమ, అదిచ్చే హక్కు – ఇవి మాట్లాడిస్తున్నాయి ఆమెను.

"ఎన్నాళ్లైనా ఒకటే... నన్ను బాధపెడితే అది తన ఆధిక్యత అనుకునే అమాయకుడు. ఏమిటీ, నువ్వేదో విమెన్ అండ్ సోషల్ కండిషన్స్ వగైరా మీద రిసెర్చ్ అన్నావు కదూ... ఈ దేశంలో ఆడవాళ్లకు, మగవాళ్లకు కావల్సిందేమిటో నీకు అర్థమైందా?"

"మొగవాళ్లకేం మాయరోగం?... ఏదైనా సమస్యలుంటే ఆడవాళ్లకేగాని..." కచ్చగా అన్నది సహజ.

"అలా ఆలోచిస్తే నువ్వు నాలుగు పుస్తకాలు చదివి రిసెర్చ్ పేపరు సబ్మిట్ చెయ్యగలవు కానీ, సమస్యలకు పరిష్కారాలు ఆలోచించలేవు...."

ఉలిక్కిపడింది సహజ... మూర్తన్నయ్య దాదాపు ఇదే మాటలు మాట్లాడాడు.

"మరి?" అడిగింది.

"గుర్తు పెట్టుకోవలసిన విషయం ఏమిటో తెలుసా? ఇక్కడ చెలామణీ అవుతున్న కుటుంబ వ్యవస్థ - మొత్తం అందరిలోనూ అభద్రతా భావం చెలరేపుతోంది. ఎవరికి వారికే ఆర్థిక అభద్రతో, సాంఘిక అభద్రతో, ఎమోషన్ డిపెండెన్సీయో తప్పడంలేదు... అవునా?!"

"అవును... అదే ఎందుకు అని?"

"ఇక్కడ మొగవాడికి ఆడదానికి కావల్సినవి తప్పుతప్పుగా అంచనా వేస్తున్నారు... ఆడదానికి ఇన్‌సెక్యూరిటీ అనుకుని రక్షణ కల్పిస్తాం, రక్షిస్తాం అంటున్నారు... మొగవాడికి స్వాతంత్ర్యం కావాలనుకుంటున్నారు... కానీ ఈ వ్యవస్థలో చిక్కుకున్న మొగవాడికి ఇన్‌సెక్యూరిటీ సమస్య ఎక్కువ. ఎంత చదువు, డబ్బు ఉన్నా నా అనే వ్యవస్థ కోసరం తపించిపోయేవాళ్లే వీళ్లంతా... ఏదో భయం... నీ భార్య లేచిపోతుందనో, నీ ఆస్తి పోతుందనో, నిన్ను గౌరవించరనో, నీ పితృదేవతలు దీవించరనో సగటు మనిషిని హింస పెట్టగలదు ఈ వ్యవస్థ. మా అమ్మ ఇలా అంటోంది, మా అక్క ఒప్పుకోదు - ఇలా మాట్లాడే ప్రతి వ్యక్తీ, ఒకొక్కసారి మా ఆవిడ వంట, ఆవిడ తెలివితేటలు - ఇలా పొగిడే ప్రతి వ్యక్తీ చాలా టెన్షన్ మీద ఉన్నట్లే లెఖ్ఖ... తెలివి గల ఆడది ఇక్కడ సైకోథెరపిస్ట్‌లా పని చెయ్యాలి... లేకపోతే, అమ్మా నాన్న చెప్పారనో, ఆస్తి వస్తుందనో ఆడదాన్ని నిట్టనిలువునా కాల్చేసెయ్యగల రోగగ్రస్తులు వీళ్లు." - వరకట్న హత్యలకు భాష్యం చెప్పేసింది పూర్ణిమ.

నిర్ఘాంతపోయింది సహజ.

"మరి ఆడవాళ్లు?"

"రవ్వంత గుర్తింపు, కొంచెం లాలింపు, మానసిక స్వతంత్రంతో చాలా చెయ్యగలదు ఆడది... తనను తాను , రక్షించుకుని, మిగతావాళ్లనూ రక్షించుకోగలదు."

'ఆవిడ దగ్గరకు వెళ్లు... నీకు చాలా చెప్తుంది -' అన్న మూర్తన్నయ్య మాటలు గుర్తువచ్చాయి.

"ఇటువంటి వ్యవస్థలో పెళ్లి అవసరమా వదినా?!"

"అది చెప్పలేను... కానీ ప్రస్తుతం పెళ్లిళ్ల పద్ధతి మాత్రం బాగాలేదు... పెళ్లే జీవితం అనుకున్నవాళ్లు చాలామంది బలైపోతున్నారు... వ్యక్తిత్వం లేకుండా కాలిపోతున్నారు... మాట్రిమోనియల్ కాలం చూసి, ఉద్యోగం, అందం ఉంటే చాలని పెళ్లికి ఒడంబడిపోతున్నారు. పెళ్లి ప్రొఫెషనల్‌గా మార్చేసుకుని చాలామంది

తెలివిగల ఆడవాళ్లు బ్రతికేస్తున్నారు. ఆడపిల్లలకు దీనివల్ల స్వతంత్ర్య ఉందేమో కానీ మొగవాడికి సెక్యూరిటీ, హాయి కనిపించవు... ఇలా చాలామంది బాధపడుతున్నారు."

"ఎందుకు బైటపడలేకపోతున్నారు? పిల్లల వల్లనా?"

"తల్లి అయిన ఆడది ఈ వ్యవస్థలో తన బిడ్డలకు తండ్రిని కాపాడుకోవడానికి పాటుపడుతుంది. కష్టాలు, అవమర్యాదలు ప్రేమతో భరించదు. తన సంసారం కోసరం భరిస్తుంది. ఈ విషయం ముప్పాతిక మూడొంతుల మొగవాళ్లకు తెలియనీయకుండా ఈ వ్యవస్థ జాగ్రత్త పడుతుంది. సంపాదించలేని మొగవాడిని ఈ వ్యవస్థ శిక్షిస్తుంది. భయపెడుతుంది. మనిషిని మనిషిగా కాక అతను తీర్చే అవసరాన్ని బట్టి గౌరవించే ఈ వ్యవస్థలో అవినీతి ఎందుకు పెరగదు? ఇది రోగగ్రస్థమైన వ్యవస్థ... ఇది మొగవాణ్ణి రోగగ్రస్థుడిగానే మారుస్తుంది. ఇతణ్ణి రక్షించగలిగేవి ప్రేమ, ఓదార్పు - ఇవే... ఇప్పుడు చెప్పు... ఇందాక నేను రాంబాబుగారితో అలా ప్రవర్తించడం అవసరమా? కాదా..."

నిర్ఘాంతపోయి చూస్తోంది సహజ...

ఈవిడ ఇంత ఆలోచిస్తోందా? ఈవిడ తెలివితేటలు, ఆలోచనాసూక్ష్మం, తన భర్తను కాపాడుకోవడానికి పడే తపన ఏమాత్రం తెలియని ఆ రాంబాబు మీద నిజంగా జాలి వేసింది సహజకు.

"వదినా! ఒక విషయం చెప్పు... ఇవ్వాల్టికి ఇవ్వాళ నాతో అమెరికా తీసుకువెళ్లి నీకు ఆర్థిక స్వాతంత్ర్యం, సాంఘిక గౌరవం ఇస్తే - హాయిగా వచ్చేస్తావా?"

కాఫీ కప్పులు తీసుకువెళుతూ వెనక్కు తిరిగి సూటిగా చూసింది పూర్ణిమ.

"రాను సహజా! రాలేను... ప్రపంచమంతా నా కాళ్ల ముందు ఉంచినా రాను..."

"కారణం?" కుతూహలంగా అడిగింది సహజ.

"చాలా కారణాలు ఉండచ్చు..."

"ఒకటి చెప్పు... నీకు ఇన్‌సెక్యూరిటీ ప్రాబ్లం వస్తుందనా? నీవాళ్లు అనుకున్న వాళ్లకు దూరం అయిపోతావనా?"

ఆలోచిస్తూ నిలబడింది పూర్ణిమ...

"ఒకప్పుడైతే నిజమేనేమో. ఇప్పుడు కాదు... రాంబాబుగారితో నాకొక అనుబంధమున్నది... అతని మనుష్యులు అతణ్ణి భయపెట్టకపోతే, అతను చాలా మంచివ్యక్తి. తప్పుదారిన పట్టిన కుటుంబవ్యవస్థ చేసే మొదటి పని ఇంట్లో వృద్ధిలోకి వస్తున్న మొగవాడిని నీ బాధ్యత నువ్వు చెయ్యడం లేదని గిల్టీగా మార్చి నిస్సత్తువ చెయ్యడం... దీనికి రాంబాబు బలైపోయారు... అతను నేను లేకుండా బ్రతకలేడు... అతడు ఈ విషయం ఒప్పుకోకపోవచ్చు... ఇది ప్రేమా అంటే కాకపోవచ్చు... కానీ నేను లేని మర్నాడు అతణ్ణి బాధపెట్టి సోషల్ స్లేవరీ చేయిస్తారు వాళ్లంతా... మరొక

కారణం. ఇక్కడ ఈ నిస్వార్థకర్తవ్యాలమధ్య నాకొక తృప్తి ఉన్నది... నా పిల్లల్ని నాకు కావల్సినట్లు, ఈ వ్యవస్థను అర్థం చేసుకుని బాగుచేసేట్లు పెంచాలని ఉన్నది... ఈ దేశంలో పుట్టినందుకు నేను ఏదో చెయ్యాలనిపిస్తోంది... పారిపోవాలనిపించడం లేదు సహజా!"

వెళ్లిపోతున్న ఆవిడ అందెల ధ్వని వింటూ అలాగే కూర్చున్నది సహజ... బుర్రంతా తిరిగిపోయింది.

తన రిసెర్చ్ పేపర్ల ముందు కూలబడింది... ఏవేవో లెఖ్ఖలు, ఏవేవో చట్టాలు... వీటన్నింటికీ అతీతంగా ఈ టైపు చేసిన అక్షరాల మధ్యనుంచి జారిపోతూ మెరుపులతో ప్రవహిస్తున్న ఏదో వ్యక్తిత్వంతో కలిసిన స్త్రీత్వం ఆమెకు దర్శనమిస్తోంది.

"ఆడవాళ్ల గురించి నీకు చాలా అర్థమవ్వాలి..." అన్న మూర్తన్నయ్య మాటలు...

❀ ❀ ❀

"వదినా!... మూర్తన్నయ్యకు ఈ మెయిల్ పంపుతున్నాను... చదువుతావా?" లాప్‌టాప్ దగ్గరకు వచ్చి చూసింది పూర్ణిమ.

మౌనంగా చదివింది.

"I have discovered what you wanted me to discover... thank you."

"నేనొక మెసేజ్ పంపించనా?" అన్నది పూర్ణిమ.

ఆ మొహంలో ఏ భావమూ లేదు. చాలా ప్రశాంతంగా ఉంది.

"నువ్వా?... గుడ్!... పంపించు... అన్నయ్య థ్రిల్ అయిపోతాడు." ఆనందంగా అన్నది సహజ.

""The soil in return for her services keeps the tree tied to her. The sky asks nothing and leaves it free"

- *Ravindranath Tagore.*

మౌనంగా టైప్ చేస్తోంది పూర్ణిమ.

('రచన' నూతన సహస్రాబ్ది - జన్మదిన ప్రతిష్ఠాత్మక ప్రత్యేక సంచిక - ఫిబ్రవరి, 2000)